నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 2 ఏప్రిల్ 2024 | NIZAMABAD

రామారెడ్డి ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

సమావేశానికి సభ్యులందరూ గైర్హాజరు

సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రామారెడ్డి, ఏప్రిల్ 1: రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డిపై సోమవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఎంపీపీపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు గత ఫిబ్రవరి 9న అవిశ్వాసం ప్రకటించి, తీర్మాన కాపీని ఆర్డీవో రంగనాథ్‌రావుకు అందజేశారు. దీంతో ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించి ఫిబ్రవరి 16వ తేదీన స్టే తెచ్చుకొన్నారు. మార్చి 14న స్టే ముగియడంతో ఎంపీపీపై మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో రంగనాథ్‌రావు ఆధ్వర్యంలో సోమవారం అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మొత్తం 10 మంది ఎంపీటీసీలకు అందరూ గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటలు దాటినా ఖాళీ కుర్చీలే దర్శనమివ్వడంతో ఎంపీపీపై అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో ప్రకటించారు. సమావేశంలో తహసీల్దార్ రోజా, ఎంపీడీవో సవితారెడ్డి,అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

ఎంపీపీపై అవిశ్వాసం వీగిపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పటాకులు కాల్చి సంబురాలు చేసుకొన్నారు. నారెడ్డి దశరథ్‌రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

అర్వింద్, సుదర్శన్‌రెడ్డి ఒక్కటే

కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్‌ఫిక్సింగ్

- 2019లోనూ ఇలాగే జరిగిందన్న వేముల ప్రశాంత్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీ తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి
- తిట్టుడు తప్ప పార్లమెంట్‌లో నోరెత్తని దద్దమ్మ అర్వింద్ అంటూ మండిపాటు

నిజామాబాద్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ ప్రతి నిధి)/ ఖిలీల్‌వాడి : గత ఎంపీ ఎన్నికల్లో కవితను ఓడగొట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటయ్యాయని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అర్బన్ నియోజకవర్గ సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ కాంగ్రెస్‌కు జగిత్యాలలో లక్ష రావాల్సిన ఓట్లకు బదులుగా 12వేలే వచ్చాయని... టి.జీవన్‌రెడ్డి ఓట్లను బీజేపీకి మళ్లించారని చెప్పారు. కాంగ్రెస్ ఓడిపోయినా సరే అర్వింద్‌ను గెలిపించారన్నారు. కాంగ్రెస్ పార్టీకి 2019లో 12వేల ఓట్లే పోలయ్యాయన్నారు. ఇప్పుడు మరో కుట్ర జరుగుతున్నదన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిది గెలుపు కాదని, అక్కడ కూడా బీజేపీ, కాంగ్రెస్ కుట్రపన్ని షకీల్‌ను ఓడగొట్టారన్నారు. బీజేపీ ఇన్‌చార్జి ప్రకాశ్ రెడ్డికి టికెట్ ఇవ్వకుండా నామమాత్రపు వ్యక్తికి టికెట్ ఇప్పించి అర్వింద్ చక్రం తిప్పి కాంగ్రెస్‌కు సహకరించారన్నారు. సుదర్శన్‌రెడ్డి గెలుపునకు అర్వింద్ సహకరించారన్నారు. ఇద్దరి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందన్నారు. దాని ఫలితమే ఇవాళ అర్వింద్‌కు వ్యతిరేకంగా ఎక్కడో జగిత్యాలలో ఉన్న జీవన్‌రెడ్డిని నిలబెడుతున్నారన్నారు. వీక్ అభ్యర్థిని కాంగ్రెస్ నిలబెట్టి అర్వింద్‌కు సహకరిస్తున్నారని ఆరోపించారు. అర్వింద్‌కు ఇప్పుడు సుదర్శన్‌రెడ్డి సహాయం చేస్తున్నారన్నా రు. దాని ద్వారా బీజేపీని గెలిపించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ తీసుకున్నదని ఆరోపించారు. మైనార్టీ ఓటర్లంతా ఈ అక్రమ సంబంధాన్ని గుర్తించాలని వేముల వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని చెప్పారు. కాలు మంచిగా లేకున్నా, బిడ్డ జైలులో ఉన్నప్పటికీ కేసీఆర్ రైతుల కోసం బయటికి వచ్చి ప్రభుత్వ కుట్రలను బట్టబయలు చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ రాకతో కాంగ్రెస్‌లో వణుకు మొదలైందన్నారు.

త్వరలోనే బీజేపీలోకి రేవంత్ రెడ్డి..

మొన్న మోదీ ముందే గుజరాత్ మోడల్ కావాలి... గుజరాత్ అభివృద్ధి బాగున్నదని కితాబునిచ్చి తెలంగాణలో గుజరాత్ మోడల్ పెడుతానని చెప్పిన రేవంత్ మాటను ప్రజలంతా గుర్తుంచుకోవాలని వేముల చెప్పారు. త్వరలోనే కాంగ్రెస్‌ను బొంద పెట్టి బీజేపీలోకి రేవంత్ రెడ్డి వెళ్తారన్నారు. నిజామాబాద్ ముస్లిం ఓటర్లంతా ఇదంతా గమనించాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

కార్యకర్తలకు కష్టమొస్తే ఏక్షణమైనా అండగా నిలబడేందుకు తామంతా సిద్ధంగా ఉన్నట్లుగా వేముల చెప్పారు. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్ పాలన అర్థమైతున్నదన్నారు. నిజామాబాద్ కార్యకర్తలంతా దెబ్బతిన్న పులిలా ప్రతీకారం తీసుకొని బాజిరెడ్డిని ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. బాజిరెడ్డిపై నిలబడిన వ్యక్తులు పోటీయే కాదన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎక్కడ నిలబడితే అక్కడ్నుంచి గెలిచిన చరిత్ర బాజిరెడ్డికి ఉందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌కు ప్రజలకు సత్సంబంధాలే లేవన్నారు. బాల్కొండలో నిలబడి సోషల్ మీడియాలో మాట్లాడడం తప్ప ప్రజల మనిషి కాదన్నారు. ఐదేండ్లలో పార్లమెంట్‌లో నిజామాబాద్ ప్రజల మేలు కోసం మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. ఒక్కరోజు కూడా మాట్లాడని ఇలాంటి దద్దమ్మలను విసిరి పారేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, బీఆర్ఎస్ నాయకులు సిర్ప రాజు, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాశ్, మురళి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



- అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటనలు
- స్థానిక నాయకత్వాన్ని కలుపుకొని ముందుకు
- ఇంకా ప్రచారమే ప్రారంభించని కాంగ్రెస్, బీజేపీ
- అర్వింద్‌పై సొంత పార్టీ నేతల్లో అసంతృప్తి



లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధత

కారు జోరు

ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్

నిజామాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ ప్రతి నిధి): ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ దూసుకుపోతున్నది. అభ్యర్థుల ఖరారు నుంచి మొదలు ప్రచారపర్వం దాకా మిగతా పార్టీలకు అందనంత స్పీడ్‌లో 'కారు' దూసుకెళ్తున్నది. మరోవైపు, కాంగ్రెస్, బీజేపీ పూర్తిగా వెనుకబడ్డాయి. రెండు పార్టీల్లోనూ పూర్తిగా స్తబ్ధత నెలకొంది. అభ్యర్థుల ఖరారులో బీఆర్ఎస్ ముందుంటే, హస్తం, కమలం పార్టీలు తీవ్ర జాప్యం చేశాయి. బీజేపీ సిట్టింగ్ ఎంపీకి మరోసారి చాన్స్ ఇవ్వగా, కాంగ్రెస్ అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత జీవన్‌రెడ్డి పేరును ప్రకటించింది.

ఒకవైపు గులాబీ శ్రేణులు ప్రచారంలో దూసుకెళ్తుంటే, ఆ రెండు పార్టీల అభ్యర్థులు ఇంకా ఎన్నికల గోదాలోకే దిగలేదు. ఎంపీ అర్వింద్‌కు టికెట్ ఇవ్వడంతో బీజేపీలో అసంతృప్తి రెట్టింపయ్యింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్వింద్ కోసం పనిచేసేది లేదంటూ సొంత పార్టీ నేతలే ప్రకటిస్తున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ బరిలోకి దించడంతో జిల్లా నేతలంతా అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. అభ్యర్థి విషయంలో జరిగిన ఆలస్యం పార్టీ శ్రేణులను నిరుత్సాహానికి గురిచేసింది.

ప్రణాళికాబద్ధంగా ముందుకు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా గులాబీ పార్టీ రెడీ అవుతున్నది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెక్ పెట్టేందుకు ప్రణాళికలను రచిస్తున్నది షెడ్యూల్‌కు ముందే జహీరాబాద్‌కు గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్‌కు బాజిరెడ్డి గోవర్ధన్ పేరును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో ఇరువురు నేతలూ ఇప్పటికే బరిలో దిగారు. శ్రేణులతో సమాయత్తమవుతూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్థానిక నేతలతో సంప్రదింపులు జరుపుతూ గెలుపు కోసం వ్యూహాలను రచిస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ వ్యూహం..

కేసీఆర్ ఆదేశాలతో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఉమ్మడి జిల్లా నేతలను సమన్వయం చేసుకుంటూ నిజామాబాద్, జహీరాబాద్ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలను రచిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ బీజేపీ, కాంగ్రెస్ ద్వంద నీతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీఆర్ఎస్ పాలనలో రైతులకు జరిగిన మేలును గుర్తుచేస్తూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతోపాటు కరెంటు కటకట, సాగునీటి కొరత, పంటలకు దక్కని భరోసా, రుణమాఫీ దాటవేత, బోనస్‌పై బోగస్ ప్రకటనలను అస్త్రాలుగా మలచుకుని కాంగ్రెస్, బీజేపీల తీరును ఎండగడుతున్నారు. చిన్నపాటి లోటుపాట్లు ఉంటే వాటిని అంతర్గతంగా సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలని నిశ్చయించారు. జహీరాబాద్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడంతో పాటు నిజామాబాద్ లోక్‌సభ సీటును సైతం కైవసం చేసుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తున్నారు.

జోరు పెంచిన బాజిరెడ్డి, గాలి అనిల్‌కుమార్..

నిజామాబాద్, జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్‌కుమార్ ప్రచారంలో జోరు పెంచారు. లోక్‌సభ పరిధిలోని నియోజక వర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేల సహకారంతో శ్రేణులను సమన్వయం చేస్తున్నారు. అసంతృప్తి నేతలను సముదాయిస్తూ ముందుకు సాగుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, ఆయా మండలాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. కేసీఆర్ అధ్యక్షతన భారీ బహిరంగ సభలను నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు. ఇక, జహీరాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు పత్తా లేకుండా పోయారు. నిజామాబాద్‌లో బీజేపీ నేతలంతా ఎదురు తిరుగుతుండడంతో అర్వింద్‌కు ముచ్చెమటలు పడుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి సైతం ప్రచారం ప్రారం భించలేదు. ఆయన అభ్యర్థిత్వంపై కొంత అసంతృప్తి నెల కొన్నదని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.అటు జహీరాబాద్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ సైతం పార్టీశ్రేణులతో అంటిముట్టనట్టు వ్యవహరిస్తుండడంపై సొంత పార్టీ నాయకులు పెదవి విరుస్తున్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

హామీలన్నీ తుంగలో తొక్కిన కాంగ్రెస్

ఖిలీల్‌వాడి, ఏప్రిల్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలోకి తొక్కింది. ప్రజలు కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలను నమ్మి మోసపోయారు. గడిచిన ఐదేండ్లలో ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లాకు చేసిందేమీ లేదు. ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఐదేండ్లు గడిచినా పత్తాలేదు. గ్రామాల్లో ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు ప్రజలు నిలదీయండి. నన్ను ఆశీర్వదించండి సేవకుడిగా పని చేస్తా, జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటా.

-బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

ప్రశ్నించే గొంతును గెలిపించుకుందాం

బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. అంతే ఉత్సాహంతో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించుకుందాం. పార్టీ వీడిన వారి గురించి పట్టించుకొని నిరుత్సాహానికి గురికావొద్దు. పార్టీ కోసం పనిచేసే నాయకులు ప్రజలకు అండగా ఉంటారు. మన మాస్ లీడర్‌ను ఢిల్లీలో గొంతు ఎత్తేలా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో నాయకులు దిక్కులేక ఎంపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు.

-బిగాల గణేశ్‌గుప్తా, అర్బన్ మాజీ ఎమ్మెల్యే

ప్రజలను కష్టాల్లోకి నెట్టేసిన కాంగ్రెస్..

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను కష్టాల్లోకి నెట్టేసింది. మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు వద్దకు వస్తున్నారు.వారి సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నారు. ఆయనకు ప్రజల్లో ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ప్రజలు ప్రస్తుతం మార్పును కోరుకుంటున్నారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఢిల్లీలో కొట్లాడి మన సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

-దాదన్నగారి విఠల్‌రావు, నిజామాబాద్ జడ్పీ చైర్మన్

కెనాల్‌కు గండిపడిన ప్రాంతం

నిజాంసాగర్ కెనాల్‌కు గండి

ఇండ్లలోకి చేరిన నీరు
అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ కాలనీవాసులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 1: ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువకు గండి పడింది. సోమవారం తెల్లవారుజామున కెనాల్ కట్ట తెగిపోయి పక్కనే ఉన్న జర్నలిస్టు కాలనీలోకి ఒక్కసారిగా నీళ్లు వచ్చిచేరాయి. ఆకస్మిక నీటి ప్రవాహంతో ఆరుబయట నిద్రిస్తున్న స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మరికొందరు ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. వెంటనే ఇరిగేషన్ సిబ్బందికి సమాచారం అందించగా.. ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీటిని నిలిపివేశారు. వరద ప్రవాహానికి చాలా మంది ఇండ్లలోని సామగ్రి కొట్టుకుపోయింది. తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

తెగిన కట్టను పరిశీలించిన జడ్పీ చైర్మన్

జర్నలిస్టు కాలనీలోకి వరద చేరుకోవడంతో విషయం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ వనం శేఖర్, ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువలోని నీటిని ఖాళీ చేయించి అవసరమైన పనులను యుద్ధప్రాతిపదికన చేయించాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఘటన విషయమై కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, డిప్యూటీ ఈఈ కృష్ణ మూర్తి, బబ్లూ,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అధికారులపై కాలనీవాసుల ఆగ్రహం..

ఇరిగేషన్, ఇతర అధికారుల నిర్లక్ష్యంతోనే కెనాల్ కట్ట తెగి ఇండ్లలోకి నీరు చేరిందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పంటలకు నీటిని వదిలే ముందు నిజాంసాగర్ ప్రధాన కాలువను శుభ్రం చేయించాల్సిన అవసరమున్నా, ఆర్మూర్ ప్రాంతంలోని ఇరిగేషన్ అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలువ మురికి కూపంలా తయారై, చెత్తాచెదారాలతో నిండిపోయి దర్శనమిస్తుందన్నారు.

జలమయమైన కాలనీలోని ఓ రోడ్డు

ఇంటి వద్దే ఓటు హక్కు

దివ్యాంగులు, వృద్ధులకు అవకాశం
12-డీ ఫారాల పంపిణీ షురూ

జిల్లా కేంద్రంలో ఓ వృద్ధురాలికి 12-డీ ఫారం అందజేస్తున్న సిబ్బంది

కంఠేశ్వర్, ఏప్రిల్ 1: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌తోపాటు 85 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునేందుకు 12-డీ ఫారాలను అందజేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈనెల 20లోగా నిర్ణీత 12-డీ ఫారం నింపి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అత్యవసర సేవలపరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నదని తెలిపారు. ఒక్కసారి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఎట్టి పరిస్థితుల్లోనూ మే 13న నిర్వహించే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటువేసే అవకాశం కల్పించబోమని స్పష్టం చేశారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఫారాల పంపిణీ

లోక్‌సభ ఎన్నికల్లో 85 ఏండ్లుపై బడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటివద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు 12-డీ ఫారాలను పంపిణీ చేయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిధిలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 ఏండ్లు పైబడిన ఓటర్లు 7,555 మంది ఉండగా.. మార్చి 30 నాటికి 3331 మంది, దివ్యాంగ ఓటర్లు 24,229 మంది ఉండగా 10,175 మందికి 12-డీ ఫారాలను అందజేయడం పూర్తయినట్లు ఆయన వివరించారు.

ట్రోఫీతోపాటు మెడల్స్‌తో జిల్లా క్రీడాకారిణులు

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు బంగారు పతకాలు

కంఠేశ్వర్, ఏప్రిల్ 1: జాతీయ స్థాయి సబ్ జూనియర్ (బాలిక విభాగం) సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నగరంలో ఉన్న ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మార్చి 29 నుంచి ఏప్రిల్ 1 వరకు పోటీలు నిర్వహించగా..మన రాష్ట్ర బాలికల జట్టు ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు పై 08-02 పాయింట్ల తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు కె.సోని (రాష్ట్ర జట్టు కెప్టెన్),ఎం గంగోత్రి, డి.లిఖిత, బి.నిశిత, కే.సౌజన్య, కే.సంహిత అద్భుత ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగా మోహన్ సోమవారం తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందించారు.

కాన్వొకేషన్ ఫీజులో ఎలాంటి పెరుగుదల లేదు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1 : టీయూలో కాన్వొకేషన్ ఫీజులో ఎలాంటి పెరుగుదల లేదని, విద్యార్థులు ఆందోళన చెందవద్దని రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. టీయూలో పరీక్షల విభాగానికి సంబంధించిన అన్ని రకాల ఫీజులు గతంలో ఉన్నట్లుగానే ఉంటాయని తెలిపారు.